నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ, పద్మశాలిపురం, ఆప్కోకాలనీ, రామ్‌రామ్ స్కూల్, శివాజీనగర్,శివాజీనగర్ ఇండస్ట్రీయల్, జల్‌పల్లి ఇండస్ట్రీయల్, వెంకటేశ్వర కాలనీలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గగన్ పహాడ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

గడప గడపకు అయోధ్య అక్షింతలు


అక్షింతలతో ఇంటింటికి భక్తులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్‌లో గడప గడపకు రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం హైదర్‌గూడ శివానగర్ కాలనీలో బస్తీ యువకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి గడపకు అక్షింతలు చేరేలా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు వేళలా పంపిణీ చేస్తూ రామమందిర ఫోటోతో పాటు జనవరి 22న తేదీన జరగబోయే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. జనవరి 22వ తేదీన అయోధ్య రామాలయంలో సీతారాముల ఆస్థాన ప్రాణప్రతిష్ఠ అనంతరం అక్షింతలు ఇంటిల్లిపాటి తలపై చల్లుకోవాలని సాయంత్రం ఐదు దీపాలు వెలిగించి దీపావళి జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుల్గే శ్రీనివాస్, నారగూడెం సోమనాథ్ రెడ్డి, సాయి యాదవ్, శ్రీపాల్, నవీన్, సాయి రెడ్డి, కౌశిక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతూప్రలో అక్షింతల పంపిణీ


అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, తదితరులు.

శంషాబాద్ రూరల్: అయోధ్యలోని రామజన్మ భూమి నుంచి తీసుకొచ్చిన అక్షింతలను నివారం మండలంలోని పెద్దతూప్రలో పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు, సర్పంచు చిటికెల వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు డి. యాదగిరి ఆధ్వర్యంలో అక్షింతలను ఇంటింటికి అందజేశారు. ఈ నెల 22న అయోధ్య ఆలయం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ రోజు అందరూ దీపాలు వెలిగించి పూజలు నిర్వహించాలని వెంకటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి


సమావేశంలో పాల్గొన్న రుద్రకుమార్

మణికొండ: గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను కొత్త ప్రభుత్వమైనా వెంటనే పరిష్కరించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ కోరారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చి ధర్నాలు చేపట్టామన్నారు. కార్మికులు ఇన్సూరెన్స్ సౌకర్యం రూ. 10లక్షల భీమా, కనీస వేతనం రూ. 26వేలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించటం, కేటగిరీల వారిగా కార్మికులకు వేతనాల చెల్లింపు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు ఎం. అశోక్, వీరేష్, చంద్రకళ, సుగుణమ్మ, లక్ష్మీ, భారతి, లావణ్య, నరసమ్మ పాల్గొన్నారు.

ఇంటింటికి రాములవారి అక్షింతలు


మైహోం అవతార్‌లో అక్షింతలను అందించిన బీజేపీ మహిళా అధ్యక్షురాలు పద్మ

మణికొండ: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను ప్రతి ఇంటికి అందించేందుకు రామభక్తుల బృందాలు కృషి చేస్తున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధి కాలనీలలో బృందాలుగా ఏర్పడి అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో అక్షింతలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు ఈ నెల 22వ తేదీన శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కాగానే ప్రతి ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలని సూచిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో రామభక్త బృందాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో ఏబీవీపీ నిరసన

రాజేంద్రనగర్: వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని శనివారం జయశంకర్ స్టేట్ యూనివర్సిటీలో ఏబీవీపీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్రికల్చర్ వర్సిటీ అంటేనే నూతన వంగడాలు పరిశోధన, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వర్సిటీ. అలాంటి వర్సిటీలో 35 సంవత్సరాలుగా మెడిసిన్ ప్లాంట్స్, వెజిటేబుల్స్ సీడ్స్ ఆ గ్రూపులు ఫారెస్ట్రీ తదితర వాటిపై ఎన్నో రకాల పరిశోధనలు జరిగి తెలంగాణ రాష్ట్రంలో రైతాంగాన్ని పటిష్టం చేయడానికి ఎనలేని కృషి చేయడం జరుగుతుందన్నారు. కానీ నేడు అగ్రో బయోడైవర్సిటీ కొనసాగుతున్న పార్కులో రాష్ట్ర హైకోర్టుకు సంబంధించిన భవనాలను కట్టడానికి జీవో నంబర్ 55ను తీసుకోవచ్చారు. దీంతో హైకోర్టు బిల్డింగ్‌ను ఈ ప్రాంగణంలో కట్టొదని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని.. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగ ఉద్యమాన్ని చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, స్టేట్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ జాయింట్ సెక్రటరీలు పృథ్వీతేజ, కళ్యాణి, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ కమల్ సురేశ్, విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీరాజ్, విభాగ్ కన్వీనర్ సూర్య ప్రకాశ్, జిల్లా కన్వీనర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చివరోజు అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ



శంషాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చివరోజు శనివారం ఆయా వార్డులో అభయ హస్తం దరఖాస్తులు అందించేందుకు జనం అధికంగా పాల్గొన్నారు. పట్టణంలోని మొత్తం 25 వార్డులో పెద్ద ఎత్తున దరఖాస్తులను అందించారు. ఒకటో వార్డులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.బి. శ్రీధర్, శేఖర్‌లు ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. నిజమైన అర్హులందరికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. నాలుగు నెలల తర్వాత మరో మారు ప్రజాపాలన కార్యక్రమంలో మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకించినట్లు ఆయన గుర్తు చేశారు.

ముగిసిన 'ప్రజాపాలన'

- వెల్లువెత్తిన దరఖాస్తులు
- మణికొండలో వచ్చిన దరఖాస్తులు 13,832
- నార్సింగిలో 10,013


అధికారులకు సన్మానించిన నార్సింగి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ తదితరులు

మణికొండ: ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందించే క్రమంలో గత నెల 28వ తేదీ నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం ముగిసింది. ప్రస్తుతం సంక్షేమ పథకాలను అందుకున్న వారు సైతం మొదట్లో దరఖాస్తులు చేసుకున్నారు. తరువాతి క్రమంలో ప్రస్తుతం పథకాలు అందుకుంటున్న వారు కొత్తగా దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. అయినా కొత్తగా పథకాలు కావాల్సిన వారితో పాటు, పాత వారు సైతం దరఖాస్తులు చేసుకున్నారు. దాంతో గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు 9206, ఇతర అవసరాలకు 807 దరఖాస్తులు వచ్చాయి. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామీణ ప్రాంతమైన 12వ వార్డు ఖానాపూర్‌లో అత్యధికంగా 815 రాగ, గేటెడ్ కమ్యూనిటీలకు నిలయమైన కోకాపేట 14వ వార్డు పరిధిలో 18 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులలో మొత్తం 13,832 దరఖాస్తులు వచ్చాయి. రెండు మున్సిపాలిటీలలో వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే కంప్యూటర్‌లలో ఎంట్రీలు చేసి ఈనెల 17వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వానికి పంపే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమయ్యింది. అన్ని పూర్తయ్యాక ఎంత మందికి సంక్షేమ పథకాలను అందుతాయో కొంత కాలం చూడాల్సిందే.

డేటా ఎంట్రీ ప్రారంభం


కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన అభయ హస్తం కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్‌చంద్ర వెల్లడించారు. దరఖాస్తుల డాటా ఎంట్రీని శనివారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. డాటా ఎంట్రీ పూర్తి చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులను గుర్తించి వారికి పథకాలను అందజేయనున్నారన్నారు.


డేటా నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ వసంతలక్ష్మీ

శంషాబాద్ రూరల్: మండల పరిధిలో ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను శనివారం నుంచి కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టారు. 27 పంచాయతీల్లో ఇప్పటి వరకు సుమారు 15వేల అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల వారిగా దరఖాస్తుల డేటా నమోదు చేస్తున్నారు. ఈ నెల 17 లోపు డేటా నమోదు పూర్తి చేయాలని ఆదేశాలు ఉండగా.. సర్వర్ సమస్యతో నమోదు నెమ్మదిగా సాగుతోంది. అర్జీ ఫాం మాదిరిగానే డేటా ఫాంలో వివరాలు నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీఓ ఉషాకిరణ్ డేటా నమోదును పర్యవేక్షిస్తున్నారు.

డీసీపీని కలిసిన టీయూడబ్ల్యూజే నాయకులు


డీసీపీకి అభినందనలు తెలిపిన టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా నాయకులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న చింతమనేని శ్రీనివాస్‌ను శనివారం రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే నాయకత్వంలో రాజేంద్రనగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. రాజేంద్రనగర్ పట్టణానికి వచ్చిన ప్రతి పోలీసు ఆఫీసర్‌కు సహకరిస్తూ జర్నలిస్టులుగా తమ కర్తవ్యాన్ని నిరూపించుకుంటూ వస్తున్నామని టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా నాయకులు తెలిపారు. ఒకరిని ఒకరు పరస్పరం సహకరించుకుంటూ శాంతి భద్రతలను కాపాడుకుంటూ దేశంలోనే రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పేరు ప్రతిష్ఠలను నిలబెట్టుకుందామన్నారు. డీసీపీ సిహెచ్. శ్రీనివాస్‌ను కలిసిన వారిలో అప్పారెడ్డి, గూడ భీమయ్య, మామా సూర్యనారాయణ, మేకల దామోదర్ రెడ్డి, వర్కల చందు, కోరని మహేశ్, పెండెం రవీందర్, విజయ్, వెంకటేశ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐకి సన్మానం



శంషాబాద్: ఆర్‌జీఐఏ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. బాలరాజును శనివారం కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పౌరుల భాగస్వామ్యంతోనే శాంతియుత వాతావరణం ఉండేలా నిరంతర చర్యలు తీసకోనున్నట్లు తెలిపారు. సీఐను సన్మానించిన వారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్, మైలారం సులోచన, ఆర్.ఎస్ అంజయ్య, పరమేష్, గణేష్, శేఖర్, యాదయ్య, శ్రీకాంత్‌గౌడ్, దయాకర్‌గౌడ్, సప్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి: డీసీపీ



రాజేంద్రనగర్: శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ప్రజలంతా తమ ప్రాంతం చుట్టు పక్కల జరుగుతున్న కార్యకలాపాలను గమనించాలన్నారు. ఎలాంటి అనుమానం ఉన్న పోలీసులకు తెలపాలని సూచించారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తారన్నారు. వారికి స్థానిక ప్రజల నుంచి సహకారం ఉంటే మరింత ఉత్సాహంతో పనులు చేపడుతారన్నారు. మాదకద్రవ్యాలు తమ ప్రాంతంలో ఎవరైన విక్రయించినా..సేవిస్తున్నా..పోలీసులకు తెలపాలన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నుంచి కొత్తగా పనులు చేపట్టేందుకు ప్రజలు వస్తున్నారని.. వారికి ఇల్లు అద్దెకు ఇచ్చే సమయంలో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. గంజాయి తదితర మాదకద్రవ్యాలు ఎక్కడ విక్రయిస్తున్నా 8712663029కు సమాచారం అందించాలన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పార్కింగ్ గొడవ

- పార్కింగ్ చార్జీలు చెల్లించకుండా సిబ్బందిపై దాడి చేసిన ముగ్గురు
- కేసు నమోదు చేసిన ఆర్‌జీఐఏ పోలీసులు

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కారు పార్కింగ్ చార్జీలు చెల్లించమని అడిగిన సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తులపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం ఉదయం 6.20 గంటల సమయంలో రెండు కార్లు పార్కింగ్ ఏరియా నుంచి బయటికి వెళుతున్నాయి. పార్కింగ్ చార్జీలు చెల్లించాలని అడిగిన సిబ్బందిపై రెండు కార్లలో ఉన్న ముగ్గురు వ్యక్తులు దాడి చేసి బూతులు తిట్టారు. అంతటితో ఆగకుండా రాంగ్ రూట్‌లో వాహనాలను తీసుకెళ్లి బారికేడ్లను సైతం ధ్వంసం చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంబంధిత కార్ల నంబర్ల ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు సిద్దిపేట జిల్లా వాసులై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలతోనే ప్రజలకు లబ్ధి


మణికొండ గార్డన్‌లో ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకుంటున్న చైర్మన్, వైస్ చైర్మన్


వట్టినాగులపల్లిలో దరఖాస్తులు తీసుకుంటున్న కౌన్సిలర్ యాదమ్మ

మణికొండ: ప్రజాపాలన కార్యక్రమంతో రాబోయే రోజుల్లో మరింత మందికి ప్రభుత్వ పథకాలతో లబ్ధి జరుగుతుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు, మణికొండ గార్డన్ కాలనీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పాల్గొని దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు డబుల్ బెడ్‌రూంలు, రేషన్ కార్డులు, పింఛన్‌లు తదితర పథకాలకు దరఖాస్తులు పెట్టుకున్నా న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వీలైనంత ఎక్కువ మందికి మేలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా త్వరలోనే అమలు చేసి చూపుతామన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం సైతం కొనసాగుతుందన్నారు. ఈనెల 17వ తేదీన పూర్తయిన దరఖాస్తు దారులు జాబిత రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు కె. లక్ష్మీనారాయణ, వసంతరావు చౌహాన్, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు శ్రీరాములు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీలో...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన దర ఖాస్తుల స్వీకరణ కార్యక్రమాల్లో 1వ వార్డులో కౌన్సిలర్ బి. యాదమ్మ, 6వ వార్డులో కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తులు చేసిన ప్రజలందరికీ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పండగలు ఆనందంగా జరుపుకోవాలి


ముగ్గుల పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మన పండగలు సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడి ఉంటాయని, వాటిని ఆనందంగా జరుపుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పి. రూపారెడ్డిలు అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ నేతాజా పార్కులో వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగకు ఆడపడుచులు వేసే ముగ్గులు ఇంటికి ఎంతో శోభ తెస్తాయని, వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి అనూష, రెండవ బహుమతి పావని, మూడవ బహుమతి రమ్యలతో పాటు పలువురికి బహుమతులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వి. వంశీకృష్ణ, కార్యదర్శి వీఎన్ యశ్వంత్, కోశాధికారి వీఎన్ఎల్ శిరీష, రిజీనల్ కోఆర్డినేటర్ వీఎస్ నవీన్‌కుమార్, జోనల్ కోఆర్డినేటర్ వీఎస్ఎల్ నిరీషలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.


మొదటి బహుమతి అందిస్తున్న బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి

కొనసాగుతున్న కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో పాల్గొన్న రెజ్లర్లు ప్రకాశ్ పహిల్వాన్, వెంకటేశ్వర్ రావులు

అత్తాపూర్: సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరీ స్ఫూర్తితో తలపెట్టిన ఐదవ అంతరాష్ట్ర రెజ్లింగ్ పోటీల్లో రెండో రోజు 150 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ధృడత్వానికి ఎంతో మేలు చేస్తాయని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు వై. శ్రీధర్ అన్నారు. రెజ్లర్లు ప్రకాశ్ పహిల్వాన్, వెంకటేశ్వర్ రావుల మధ్య పోటీ జరిగింది. స్థానికంగా ఉన్న రెజ్లర్లు 11 సంవత్సరాల వయస్సునే కుస్తీ పోటీల్లో పాల్గొంటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి వెళ్లడం... దాని వెనుక ఎంతో కఠోర దీక్ష దాగి ఉందన్నారు. రాజు గత కొన్ని సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి కుస్తీ పోటీలు నిర్వహించడంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన రెజ్లర్ రాజును ప్రత్యేకంగా అభినందించారు. పురుషులకు ధీటుగా అమ్మాయిలను కుస్తీ పోటీల్లో పాల్గొనడం ఎంతో అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. కొమురయ్య, రాజశేఖర్, రెజ్లర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ చారిటీ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షులు అనిల్ రాంచందానీ

అత్తాపూర్: అత్తాపూర్‌లోని సాలిటైర్ గ్లోబల్ స్కూల్ వద్ద శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ (ఆర్‌ఐ డిస్ట్రిక్ట్ 3150) దక్కన్ చారిటీ-2024 ఫండ్ కోసం రైజింగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షులు అనిల్ రాంచందానీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ రాంచందానీ మాట్లాడుతూ... రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ టైమ్, స్పీడ్, డిస్టెన్స్ కారు ర్యాలీని నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. దాదాపు 100 మంది ఈ ర్యాలీలో పాల్గొనడంతో అద్భుతమైన స్పందన లభించిందన్నారు. మా స్పాన్సర్‌లు ఉదారంగా దీని కోసం రూ.40 లక్షలు వారి సీఎస్ఆర్ నిధులను సహకరించారన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అనేక కమ్యూనిటీ సేవా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధులను సేకరించడానికి ఈ చారిటీ ఈవెంట్‌లను నిర్వహిస్తున్నామన్నారు. దెక్కన్ యాక్సిలరేట్స్ ఫర్ ఛారిటీ-టైమ్, స్పీడ్, డిస్టెన్స్ కారు ర్యాలీ నిర్వహించామన్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లో పేదలు, నిరుపేదల కోసం డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మించడానికి ఈ సహాయంగా హైదరాబాద్ నుంచి హంపి వరకు ర్యాలీ నిర్వహించిందన్నారు. ఈ సేకరించిన డబ్బులను డయాగ్నోస్టిక్ సెంటర్‌ను నిర్మించడానికి వినియోగిస్తామన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

బండ్లగూడ: ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవుతూ ప్రజల అవసరాలను తీరుస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ, సమస్యలు దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. 1వ డివిజన్‌లో ముఖ్యంగా మంచినీటి సమస్య చాలా ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మేయర్ మహేందర్‌గౌడ్ సహాయ సహకారాలతో అభివృద్ధి పనులను నిర్వహించి కార్పొరేషన్‌లోనే ప్రథమ స్థానంలో ఉంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజుకుమార్, మహేందర్, రాము, మదర్, బషీర్ తదితరులున్నారు.

